సాక్షి
వరంగల్
శుక్రవారం | 2 | మే | 2025



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందజేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. - 8లో



కోర్టు ఆదేశాలు బేఖాతర్

సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పు ఇచ్చినా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. - 8లో

గరిష్టం/కనిష్టం
38^0 /26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వర్ధన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం 87 మందికి రూ.27.5 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకంలో అనేక అక్రమాలు జరిగాయని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం పేదలకు పారదర్శకంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ వర్ధన్నపేట, ఐనవోలు మండలాల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, సమ్మెట మహేశ్‌గౌడ్, నాయకులు పోశాల వెంకన్న, సుధీర్‌కుమార్, సాంబయ్య, భాను ప్రసాద్, కుల్లా యాకాంతం, బిర్రు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మొండ్రాయి విద్యార్థినులు




లక్ష్మీప్రసన్న, చిన్ను

సంగెం: రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.విజయ, పీడీ ముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30న వరంగల్ ఓ సిటీలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల ఎంపికలో విద్యార్థినులు బి.లక్ష్మీప్రసన్న, జి.చిన్ను ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 2 నుంచి 4 వరకు జగిత్యాలలో జరుగనున్న జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ శ్రీలత, హెచ్‌ఎం విజయ, పీడీ ముఖర్జీ, ఉపాధ్యాయులు అభినందించారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం



గీసుకొండ: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం గ్రేటర్ వరంగల్ గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగాయి. అడ్వకేట్ శ్రీధర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎండీ షకీల్ అహ్మద్ (గోరె మియా), ప్రధాన కార్యదర్శిగా వేముల శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొరిశెట్టి నారాయణ, ఉపాధ్యక్షులుగా టి.రాకేశ్‌సింగ్, ఎస్‌డీ ఖాజా, ఈ.రాజేంద్రకుమార్, ఎస్‌కే సోహెల్, ప్రధాన కార్యదర్శిగా వేముల రంజిత్, కోశాధికారిగా శ్రీహరి, సహాయ కోశాధికారిగా శనిగరం శ్రీహరితోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గోరె మియా మాట్లాడుతూ కొండా దంపతులు, కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆశీస్సులతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని, లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

ఆయిల్‌పామ్ మొక్కలు దగ్ధం



రాయపర్తి: ఆయిల్‌పామ్ మొక్కలు దగ్ధమైన ఘటన రాగన్నగూడెంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, బాధితులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రెంటాల జ్యోతి–గోవర్ధన్‌రెడ్డి దంపతులు మూడేళ్ల క్రితం ఎకరం భూమిలో 60 ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ క్రమంలో పక్క పొలంలో ఉన్న వరి కొయ్యకాళ్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆయిల్‌పామ్ మొక్కలు పూర్తిగా దగ్ధమయ్యాయి. వర్ధన్నపేట ఫైర్‌స్టేషన్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. మరో ఏడాదిలో చేతికి రానున్న పంట పూర్తిగా కాలిపోయి రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగిందని జ్యోతి–గోవర్ధన్‌రెడ్డి దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.

గతం కంటే మెరుగు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు

- 5,107 మంది పరీక్షలకు హాజరు.. 4,571 మంది విద్యార్థుల ఉత్తీర్ణత
- గత సంవత్సరం 91.07.. ఈ సంవత్సరం 92.84 శాతం పాస్
- 30 స్కూళ్లలో 100 శాతం రిజల్ట్స్



ఆరెల్లి బుచ్చయ్య ఉన్నత పాఠశాలలో విద్యార్థి నిశ్చల్‌కార్తికేయను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: పదో తరగతిలో ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల పరిధిలోని 5,107 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 4,571 మంది ఉత్తీర్ణత సాధించారు. 536 మంది ఫెయిల్ అయ్యారు. జిల్లాలోని 30 ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతిలో 100 శాతం ఫలితాలను సాధించాయి. గత సంవత్సరం 91.07 శాతం, ఈ సంవత్సరం 92.84 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ప్రభుత్వ పాఠశాలలో టాపర్లు వీరే..

ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నిశ్చల్ కార్తికేయకు 600 మార్కులకు 579 మార్కులు సాధించాడు. ఈ మేరకు గురువారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థి నిశ్చల్‌కార్తికేయను ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శైలేంద్రకుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, రమణ, భాస్కర్, కిరణ్, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మట్వాడ పాఠశాలలో విద్యార్థులకు సన్మానం

వరంగల్ మట్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందెల రశ్మిక 562, రామగిరి లక్ష్మీకీర్తన 526, నంతాబాద్ రజశ్మిత 514, రాగిదేవి ప్రసాద్ 505 మార్కులు సాధించారు. పాఠశాలలో హెచ్‌ఎం కె.అరుణ వీరికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. రశ్మికకు రూ.మూడు వేలు, మిగిలిన విద్యార్థులకు రూ.రెండు వేల నగదు బహుమతి ప్రకటించారు. తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఒక్కో విద్యార్థికి రూ.1500 చొప్పున అందజేసి సన్మానించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి, 10వ తరగతి క్లాస్‌టీచర్ దేవులపల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా నెక్కొండలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు ఎర్రోజు హాసిని 577 మార్కులు, తడక నేహాగౌడ్ 574, దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి అడ్డగట్ల అక్షయ్ 577, వరంగల్ కృష్ణా కాలనీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బత్తి విష్ణువర్ధన్ సింగ్‌కు 574, వరంగల్ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు దొడ్డిపాక భవన్ 571, బొల వివేక్ 561, నెక్కొండ మండలం మోడల్ స్కూల్ విద్యార్థిని బొమ్మ సింధూజ 563, రాయపర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని మర్రి రక్షిత 562,వరంగల్ మట్వాడ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని సందెల రశ్మిక 562 మార్కులతో సత్తా చాటారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత వివరాలు..

పాఠశాలలు	పరీక్షలకు హాజరైన వారు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణ శాతం
హైస్కూళ్లు	1,003	824	82.15
జిల్లా పరిషత్	1,989	1,740	87.48
ఎయిడెడ్	120	98	81.67
ఆశ్రమ పాఠశాలలు	75	72	96
బీసీ వెల్ఫేర్	426	421	98.83
కేజీబీవీలు	336	320	95.24
మోడల్ స్కూళ్లు	475	434	91.37
రెసిడెన్షియల్ స్కూళ్లు	73	72	98.63
మైనార్టీ వెల్ఫేర్ స్కూళ్లు	167	163	97.60
సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు	298	288	96.64
ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లు	145	139	95.64

గత ఏడాది ఉత్తీర్ణత శాతం వివరాలు..

గత ఏడాది ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి 5,481 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5,096 మంది ఉత్తీర్ణత సాధించారు. 585 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత ఇలా ఉంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 82.70 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 86.89 శాతం, ఎయిడెడ్ పాఠశాలలు 80.70 శాతం, కేజీబీవీలు 90.13 శాతం, ఎంజేపీటీలో (98.46 శాతం), టీఎంఆర్‌ఎస్‌లో 98.01 శాతం, ట్రైబల్ వెల్ఫేర్‌లో 92.70 శాతం , టీఎస్‌ఎంఎస్‌లో 92.61 శాతం, టీఎస్ఆర్‌ఈఐఎస్‌లో 97.47 శాతం, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ 98.08 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ప్రత్యేక దృష్టితోనే మెరుగైన ఫలితాలు



జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. దీంతో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. డీఈఓ జ్ఞానేశ్వర్ పర్యవేక్షణలో విద్యార్థులకు ఉదయం ఒక గంట, సాయంత్రం మరోగంట పాటు అదనంగా సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై కూడా దృష్టి సారించాం. కలెక్టర్ సత్యశారద విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం కూడా నిర్వహిచారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, భయాందోళన లేకుండా పరీక్షలు రాసేందుకు స్ఫూర్తి కార్యక్రమం దోహదం చేసింది.

కె.అరుణ, డీఈఓ కార్యాలయ ఏసీజీఈ

ప్రణాళికాబద్ధంగా చదివించాం..



ఖిలా వరంగల్: పదో తరగతిలో చక్కటి ఫలితాలు సాధించాం. పడమర కోటకు చెందిన విద్యార్థి మంద నిశ్చల్ కార్తికేయ 600 మార్కులకు 579 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రణాళికాబద్ధంగా చదివించాం. విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించాం. మా పాఠశాల విద్యార్థి జిల్లా టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది.

- శైలేంద్రకుమార్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం
ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మధ్యకోట

కార్మికులకు విశ్రాంతి భవనం నిర్మిస్తాం..



మే డే వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో హమాలీ కార్మికులకు విశ్రాంతి భవనం నిర్మిస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. కూరగాయల మార్కెట్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన మే డే వేడుకల్లో గురువారం ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులకు 8 గంటల పనిదినం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన వారి స్ఫూర్తితో మేడే జరుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద,యూనియన్ గౌరవ అధ్యక్షుడు బోగి సురేశ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డి, నాయకులు గోపాల నవీన్‌రాజ్, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్లు జారతి రమేష్, వేణుగోపాల్, నాయకులు మీసాల ప్రకాశ్, కొత్తపల్లి శ్రీనివాస్, వర్తక సంఘం నాయకులు జారతి శ్రీనివాస్, బేతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద



శిబిరాల శిక్షకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: జిల్లా యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి క్రీడా శిబిరాలను చిన్నారులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. వరంగల్ ఓసిటీ స్టేడియంలో గురువారం ఉచిత వేసవి క్రీడా శిబిరాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జూన్ 6 వరకు జరిగే వివిధ క్రీడాంశాల్లో కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. జిల్లాలోని 10 గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓ సిటీ స్టేడియంలో ఖోఖో, క్రికెట్, జూడోలో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. వేసవి సెలవులను ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అర్బన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల శిక్షకులకు కలెక్టర్ క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీవైఎస్‌ఓ సత్యవాణి, తహసీల్దార్ ఇక్బాల్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాశ్‌యాదవ్, ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ పరంజ్యోతి, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ బోర్డు కన్వీనర్ దిలీప్, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సంజీవ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

మాదక ద్రవ్యాల నియంత్రణకు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ అంకిత్‌కుమార్‌తో కలిసి గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్డీఓ ఉమారాణి పాల్గొన్నారు.

క్రీడాశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 5 నుంచి 20 వరకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో వేసవి శిబిరాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లాలోని 50 పాఠశాలలు సిద్ధంగా ఉన్నాయని, ప్రతి శిబిరంలో 100 మంది విద్యార్థులకు శిక్షణ అందించాలని సూచించారు. డీఆర్వో విజయలక్ష్మి, డీఈఓ జ్ఞానేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

- వరంగల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతంరెడ్డి



విద్యుత్ భద్రత–పొదుపు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

సంగెం: వినియోగదారులు, సిబ్బంది అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చని వరంగల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతంరెడ్డి అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా కాపులకనిపర్తి, సంగెం, మచ్చాపూర్ సెక్షన్ల సిబ్బంది, వినియోగదారులకు 'విద్యుత్ భద్రత–పొదుపు'పై గురువారం గవిచర్ల రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వానలు, ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీగలు తెగిపోవడం, సాగడం, స్తంభాలు విరిగితే సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే విద్యుత్ ప్రసరించని వస్తువులతో మాత్రమే రక్షించాలని, విద్యుత్ షాక్ తగిలి స్పృహ కోల్పోయిన వ్యక్తిని సీపీఆర్ ద్వారా బతికించవచ్చని సీపీఆర్ చేసే విధానాన్ని ఎస్ఈ గౌతంరెడ్డి వివరించారు. కార్యక్రమంలో వరంగల్ డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ ఎ.ఆనందం, డీఈ బి.భిక్షపతి, ఏడీఈ నర్సింహారావు, ఏఈలు అశ్విన్‌కుమార్, మధుసూదన్, సంపత్‌రెడ్డి, సబ్ ఇంజనీర్లు, సెక్షన్ల పరిధిలోని విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లి 'కరెంట్' సమస్య కొలిక్కి

- తహసీల్దార్ రియాజుద్దీన్ చొరవ
- బకాయిల చెల్లింపునకు 20 రోజుల గడువు



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజుద్దీన్

గీసుకొండ: జాతీయ ఆదర్శగ్రామం గంగదేవిపల్లి కరెంట్ బిల్లుల సమస్య కొలిక్కి వచ్చింది. గ్రామంలోని బాలవికాస మినరల్ వాటర్ ప్లాంట్ విద్యుత్ బకాయిలు రూ. 81,448 చెల్లించాల్సి ఉండగా.. ఎన్పీడీసీఎల్ అధికారులు రెండు రోజుల క్రితం కరెంట్ సరఫరా నిలిపివేసిన విషయం తెలిసిందే. అధికారుల ఆదేశాల మేరకు బిల్లుల చెల్లింపు విషయమై గ్రామ స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ రియాజుద్దీన్ గురువారం ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు నల్లా కనెక్షన్ ఉన్న ప్రతీ కుటుంబం ఏడాదికి రూ.500 ఎందుకు చెల్లించడం లేదని తహసీల్దార్ గ్రామస్తులను ప్రశ్నించారు. బాలవికాస మినరల్ వాటర్ ప్లాంట్ కరెంట్ బిల్లుతోపాటు దాని నిర్వహణ గ్రామపంచాయతీకి అప్పగిస్తారా లేదంటే గ్రామంలోని మంచినీటి నిర్వహణ కమిటీ వారే నిర్వహణ స్వయంగా చూసుకుని బిల్లులు చెల్లిస్తారా అని అడిగారు. అభిప్రాయాలను సేకరించడానికి చేయెత్తి చూపాలని కోరగా గ్రామస్తులు రెండింటికీ ఎవరూ పూర్తిగా స్పందించలేదు. ఎన్పీడీసీఎల్ డీఈకి తహసీల్దార్ ఫోన్ చేసి బిల్లులు చెల్లించడానికి కొంత సమయం ఇవ్వాలని అడుగుతున్నారని చెప్పారు. ఆయన కోరిన మేరకు 20 రోజుల్లో చెల్లించాలన్న డీఈ.. మినరల్ వాటర్ ప్లాంట్‌కు కరెంట్ సరఫరా పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, కరెంట్ బిల్లుల చెల్లింపు విషయంపై మరోమారు గ్రామ సభ నిర్వహించాలని సభలో తీర్మానించారు. గ్రామస్తులు లేవనెత్తిన అంశాలను తాను కలెక్టర్‌కు నివేదిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మంచినీటి నిర్వహణ కమిటీకి సంబంధించిన రూ.నాలుగు లక్షల మేర ఆదాయాన్ని కొందరు స్వాహా చేసి, కమిటీని నిర్వీర్యం చేశారని మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి సభ దృష్టికి తెచ్చారు. అయితే, ఎలాంటి అక్రమాలు, స్వాహా జరగలేదని అన్ని లెక్కలు ఉన్నాయని మరో మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి వివరించారు. ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి సునీత, మంచి నీటి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గోనె నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు కూసం రమేష్, వాటర్ కమిటీ మాజీ చైర్మన్ కూసం లింగయ్య, గ్రామ పెద్దలు చల్ల మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించారు..

నలుగురు సివిల్ జడ్జిలుగా ఎంపిక

- ఇటీవల ఫలితాలు ప్రకటించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం
- ఎంపికైనవారిలో ముగ్గురు మహిళా న్యాయవాదులు, ఒక న్యాయశాఖ ఉద్యోగి

వరంగల్ లీగల్: న్యాయశాస్త్ర పట్టా పొందిన వారు న్యాయవాదిగానే ఉండకుండా జడ్జి కావాలన్న వారి లక్ష్యం నెరవేరింది. ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష ఫలితాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన ముగ్గురు మహిళా న్యాయవాదులు, ఒక న్యాయశాఖ ఉద్యోగి మెరుగైన ప్రతిభ కనబర్చి జడ్జిలుగా ఎంపికయ్యారు. వారిలో వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన గంగిశెట్టి ప్రసీద, నర్సంపేటకు చెందిన అంబటి ప్రణయ, వరంగల్ జిల్లా ఫ్యామిలీ కోర్టు టైపిస్ట్ లడే రాజు ఉన్నారు.

న్యాయవాది నుంచి జడ్జిగా..



ప్రసీద

వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన గంగిశెట్టి హరినాథ్, పరిపూర్ణ దంపతుల కుమార్తె ప్రసీద 2022లో హనుమకొండ ఆదర్శ లా కాలేజీలో చదివి న్యాయశాస్త్ర పట్టా పొందారు. నాటినుంచి జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది కేవీకే గుప్త, గువ్వల సాంబరాజు సహకారంతో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ జడ్జిగా విజయం సాధించారు. ఈసందర్భంగా ప్రసీద మాట్లాడుతూ లక్ష్య సాధనకు ప్రణాళిక ఎంత అవసరమో.. నిబద్ధత కలిగిన కార్యాచరణ సైతం అంతే ముఖ్యమని అన్నారు. తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో జూనియర్ జడ్జిగా ఎంపికైనట్లు తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగుల కోటాలో..



లడే రాజు

హనుమకొండ జిల్లా కమలపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన లడే వినోద, మోహన్ రావు దంపతుల కుమారుడైన లడే రాజు న్యాయశాఖ ఉద్యోగిగా కరీంనగర్ జిల్లాలో నియామకమై ప్రస్తుతం వరంగల్ ఫ్యామిలీ కోర్టులో టైపిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2007లో ఎల్‌బీబీ చేసి, 2010 ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసిన రాజు న్యాయశాఖ ఉద్యోగుల కోటాలో ఎంపికైన ఏకైక అభ్యర్థిగా నిలిచారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, భార్య పిల్లల సహకారం.. న్యాయమూర్తుల సలహాలు, సూచనలతో విజయం సాధించినట్లు రాజు తెలిపారు.

మొదటి ప్రయత్నంలోనే..



అంబటి ప్రణయ

వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అంబటి వెంకన్న, విజయ దంపతుల కుమార్తె అంబటి ప్రణయ కాకతీయ యూనివర్సిటీనుంచి న్యాయ శాస్త్ర పట్టభద్రురాలై 2023 డిసెంబర్ 30న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. ఎంఫార్మసీ సైతం పూర్తి చేశారు ఆమె భర్త లవణ్‌కుమార్ ప్రస్తుతం కాజీపేటపోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. తన భర్త లవణ్‌కుమార్ సహకారం, సీనియర్ న్యాయవాది సమీప బంధువు పూస శ్రీనివాస్ ప్రోత్సాహంతో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించినట్లు ప్రణయ తెలిపారు.

2023లో న్యాయ శాస్త్రం పట్టా..



మేఘన

వరంగల్ దర్గా కాజీపేటకు చెందిన దారా మేఘన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. మేఘన తల్లి అరుణకుమారి ఎల్ఐసీ ఆఫీసర్‌గా.. తండ్రి బాలకృష్ణ నల్సార్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచి 2023లో న్యాయ శాస్త్రం పట్టా పొంది న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుంది. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది.

చెట్టు కూలి ఆలయం ధ్వంసం

- మాలధారులకు తప్పిన ప్రమాదం

మచ్చాపూర్‌లో ఆలయంపై కూలిన చెట్టును పరిశీలిస్తున్న శ్రీనివాస్, హనుమాన్ మాలధారులు



గీసుకొండ: చెట్టు కూలి ఆలయం ధ్వంసమైన సంఘటన మచ్చాపూర్‌లో జరిగింది. గ్రామంలో పాలరాయి శివలింగంతో కూడిన 200 ఏళ్ల నాటి భవానీ శంకర సమేత భక్తాంజనేయస్వామి ఆలయం ఉంది. బుధవారం అర్ధరాత్రి పక్కనే ఉన్న వందేళ్లనాటి వేప చెట్టు ఆలయంపై కూలిందని అర్చకుడు దూపం మఠం రాజు తెలిపారు. ఈ ఘటనలో ఆలయ శిఖరం, ధ్వజస్తంభం పూర్తిగా ధ్వంసం కావడంతోపాటు గర్భగుడి పాక్షికంగా దెబ్బతిందని ఆయన పేర్కొన్నారు. ఆలయ ఆవరణలోని రేకుల షెడ్డులో 40 మంది హనుమాన్ మాలధారులు బస చేస్తున్నారు. రాత్రి వారు నిద్రిస్తుండగా షెడ్డు కూలడంతో ఎలాంటి గాయాలు కాలేదు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ గురువారం ఆలయాన్ని పరిశీలించారు. విషయాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ పునర్నిర్మాణానికి చొరవచూపాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాజీపేట నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు

● మే, జూన్‌లో నడిపించనున్న రైల్వే..



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ నుంచి తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రానికి ప్రయాణికులు, భక్తుల కోసం వేసవిని పురస్కరించుకొని ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు

కాజీపేట–తిరుపతి (07253) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24వ తేదీల్లో కాజీపేట నుంచి 13:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 09:40 గంటలకు చేరుతుంది. అదేవిధంగా తిరుపతి–కాజీపేట (07254)వెళ్లే ఎక్స్‌ప్రెస్ మే 6, 13, 20, 27, జూన్ 4, 11, 18, 25వ తేదీల్లో ప్రతి బుధవారం తిరుపతిలో 12:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు కాజీపేటకు 08:00 గంటలకు చేరుతుంది. ఈ సర్వీస్‌లకు జనగామ, భువనగిరి, చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, సేడెమ్, సులేహలి వెస్ట్, యాద్గిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గూటి, తాడిపత్రి, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ అవకాశం కల్పించారు.

కేయూలో యథావిధిగా హాస్టల్స్, మెస్‌లు

కేయూ క్యాంపస్: అలుమనాక్ ప్రకారం కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులకు మే 1 నుంచి అధికారులు సెలవులు ప్రకటించారు. అయితే పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులు మాత్రం తమకు పోటీ పరీక్షలున్నాయని యథావిధిగా హాస్టళ్లు, మెస్‌లను కొనసాగించాలని ఇటీవల ఆందోళన చేశారు. దీంతో హాస్టల్స్, మెస్‌లను యథావిధిగా కొనసాగిస్తున్నారు. గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులతో అకాడమిక్ కమిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు. పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం హాస్టళ్లు, మెస్‌లను కొనసాగిస్తున్నందున వారికి నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెలలో నిర్వహించాలనే అంశం చర్చకు వచ్చిందని సమాచారం. కానీ, జూన్ 6వ తేదీ నుంచి పీజీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు టైంటేబుల్ ప్రకటించారు. ఈనెల 2న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి వచ్చాక సమావేశం నిర్వహించి తుదినిర్ణయం తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. సెలవులు ఇచ్చినప్పటికీ హాస్టల్, మెస్ సదుపాయం కల్పించాలని సుమారు 149మంది పీజీ కోర్సుల ఫస్టియర్ విద్యార్థులు సంబంధిత అధికారులను కోరారు. వారికి కూడా అవకాశం ఇచ్చినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, లా కళాశాల విద్యార్థుల హాస్టళ్ల మెస్‌లను మూసివేసినట్లు డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా బీఈ డీ, ఎంఈడీ కోర్సుల విద్యార్థులకు హాస్టళ్లలో, మెస్ సదుపాయం యథావిధిగా కొనసాగనుంది.

సమ్మక్కసాగర్ @ డెడ్ స్టోరేజ్

జలాశయానికి తగ్గుతున్న ఇన్‌ఫ్లో
- బ్యారేజీలో తేలిన ఇసుక మేటలు
- మున్ముందు తప్పని నీటి కష్టాలు
- ఇన్‌టెక్ వెల్ నుంచి ఒక మోటారు ద్వారా పంపింగ్



నీరులేకపోవడంతో ఇసుక మేటలతో ఉన్న సమ్మక్క బ్యారేజీ ప్రాంతం

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. దేవాదుల ఇన్‌టెక్ వెల్ పంపింగ్‌కు జీవనాధారంగా పిలువబడే జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండడంతో పంపింగ్‌కు అంతరాయం ఏర్పడుతుందనే చర్చ సాగుతుంది. పంపింగ్ నిలిచిపోతే దేవాదులకు దిగువన ఉన్న భీమ్‌ఘనపూర్, గొల్లబుద్ధారం వంటి రిజర్వాయర్లకు నీటి కష్టాలు తప్పవనే సంకేతాలు వస్తున్నాయి. ప్రస్తుతం సాగు నీటి అవసరం తగ్గినా.. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు ముందుచూపుతో బ్యారేజీలో నీటిని నిల్వ ఉంచకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తగ్గిన నీటి నిల్వలు..

సమ్మక్క సాగర్ బ్యారేజీ జలాశయంలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గి డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.76 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. బ్యారేజీ పూర్తి నీటి మట్టం 83 మీటర్లు కాగా ప్రస్తుతం 72.30మీటర్లు ఉన్నాయి. బ్యారేజీలోకి ఎగువ నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుంది. బ్యారేజీలోని 59 గేట్లలో 58 గేట్లను క్లోజ్ చేసి ఒక గేటు నుంచి 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గత కొంత కాలంగా పూర్తి గేట్లను మూసి నిల్వ చేసిన నీటిని దిగువ ప్రాంతాల తాగు నీటి అవసరాల నిమిత్తం వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలుపుతున్నారు.

దిగువ ప్రాంతాలకు తప్పని తిప్పలు..

దేవాదుల ఇన్‌టెక్ వెల్‌కు దిగువన ఉన్న గొల్ల బుద్ధారం, భీమ్ ఘనపూర్, మొదలగు జలాశయాలకు నీటి ఇబ్బందులు తప్పేలా లేవు. దేవాదుల పంపింగ్ నిలిచిపోతే దిగువన ఉన్న జలాశయాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అదే జరిగితే ఆ జలాశయాల నీటిపై తాగు నీటికి ఆధారపడే ప్రాంతాలకు నీటి అవసరాలు తీర్చడానికి అధికారుల వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు కనబడడం లేదు.

నిలిచిపోనున్న దేవాదుల పంపింగ్..

తుపాకులగూడెం గ్రామ పంచాయతీలోని గుట్టలగంగారం గ్రామ పరిధిలోని దేవాదుల ఎత్తిపోతల పంపింగ్ కొద్ది రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే పరిస్థితికి నెలకొంది. ఇన్‌ఫ్లో లేకపోవడంతో గోదావరిలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. దేవాదుల వద్ద 71.00మీటర్ల నీటి మట్టం వరకు పంపింగ్ చేసే అవకాశం ఉండగా.. ప్రస్తుతం 71.75 మీటర్లు మాత్రమే ఉన్నాయి. దేవాదుల వద్ద మూడు ఫేజ్‌లలో పది మోటార్లు ఉండగా.. ఏప్రిల్‌లో 5,6 మోటార్ల ద్వారా పంపింగ్ చేసిన అధికారులు నీటి నిల్వలు తగ్గడంతో ఒక మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. వీటితోపాటు సమ్మక్క బ్యారేజీలోని ఒక గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అంటే రోజులో 547 క్యూసెక్కుల నీరు గోదావరిలో తగ్గిపోతుంది. కానీ, ఎగువ నుంచి బ్యారేజీలోకి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుంది.

ఎగువ నుంచి నీరు రావడం లేదు



గోదావరిలోకి ఎగువ నుంచి నీరు రాకపోవడంతో బ్యారేజీలో నీరు తగ్గిపోతుంది. దేవాదుల వద్ద పంపింగ్‌కు సరిపడా నీరు అందకపోవడంతో ప్రస్తుతం ఫేజ్ 2లో ఒక మోటారు ద్వారా మాత్రమే పంపింగ్ చేస్తున్నాం. గోదావరిలోకి నీరు చేరితే మరో కొన్ని మోటార్లు ఆన్ చేసి పంపింగ్ చేస్తాం. బ్యారేజీ దిగువన గోదావరికి ఉన్న మిషన్ భగీరథ పంపింగ్ కొనసాగించడం కోసం బ్యారేజీలో ఒక గేటును ఎత్తి నీటిని వదులుతున్నాం.

– శరత్ బాబు, దేవాదుల డీఈఈ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- దేశవ్యాప్త కులగణన ఆలోచనకు రాష్ట్రమే దిక్సూచి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం: అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు అందజేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి స్వగ్రామమైన మండలంలోని ధన్వాడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బొడిగె భాగ్య, చేకూర్తి పావని, ఆత్కూరి దుర్గ, తాటి పల్లవి ఇంటి నిర్మాణానికి కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా స్థలాలు కలిగిఉన్న అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంథని నియోజకవర్గం కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు మొదటి విడతలో భాగంగా 1,773 ఇళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పదేళ్లలో పేదల సొంతింటి కల నెరవేరలేదని అన్నారు. మొదటి దశలో స్థలం ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విడతల వారీగా ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణాలను సబ్ కలెక్టర్ నిత్యం పర్యవేక్షించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్మాణ ప్రగతి ఫొటోలను సంబంధిత అధికారులు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టే ఆలోచనకు రాష్ట్రం దిక్సూచి అయిందన్నారు. అనంతరం విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పలువురు చిన్నారులను పలకరించి ఏ పాఠశాలలో చదువుతున్నారు.. ఏ తరగతి చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులను హైదరాబాద్, ఢిల్లీ స్థాయిలో పంపిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణశాఖ పీడీ లోకిలాల్, డీఆర్‌డీఓ నరేశ్, డీపీఓ వీరభద్రయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సమ్మయ్య, మహేశ్ పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందులుంటే ఫోన్ చేయండి

● టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

హన్మకొండ: ధాన్యం కొనుగోళ్లు, కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులున్నా, సమస్యలు, సలహాలు, సూచనల కోసం రైతులు టోల్ ఫ్రీ నంబర్ 180 0 4250 0333కు ఫోన్ చేయాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో రైతులను కోరారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అదనపు తాలు, తూకం పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, రాత్రి వేళ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

రూ.లక్ష ఇస్తే ఉద్యోగం నీకే..!

- వాట్సాప్ కాల్‌లో బేరసారాలు
- డీఎంహెచ్ కార్యాలయ ఉద్యోగిగా పరిచయం



ఫిర్యాదు చేసిన ప్రేమ్ కుమార్

జనగామ: హలో.. వైద్యారోగ్య శాఖ లో ఉద్యోగం కావాలా..? రూ.లక్ష పట్టుకురా.. బాధ్యత నాది అంటూ ఓ వ్యక్తి.. డీఎంహెచ్ఓ కార్యాలయం అధికారిగా చెబుతూ ఓ నిరుద్యోగికి వాట్సాప్ కాల్ చేసి బేరసారాలు సాగించిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు చిల్పూరు మండలం కృష్ణాజీగూడేనికి చెందిన మారపాక ప్రేమ్‌కుమార్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎస్) పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో గత నెల 26, 27వ తేదీల్లో ఓ వ్యక్తి నుంచి రెండుసార్లు వాట్సాప్ కాల్ రాగా.. ప్రేమ్‌కుమార్ లిఫ్ట్ చేయలేకపోయాడు. మరోసారి కాల్ రాగా.. లిఫ్ట్ చేయడంతోనే ఎస్‌టీఎస్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు కదా.. అంటూ ప్రేమ్ కుమార్ వివరాలను పూర్తిగా చెప్పాడు. ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ముట్టజెబితే ఆ పోస్టు నీకే వస్తుందని నమ్మబలకడంతో అంత స్థోమత తనకు లేదని నిరాకరించారు. చివరగా వచ్చిన మెరిట్ లిస్టులో తన పేరు 6వ స్థానంలో ఉండగా, జాబితాలో అవకాశం రాకపోవడంతో నిరాశకు లోనయ్యాడు. ఉద్యోగ నియామక ప్రక్రియలో 1 నుంచి 11 స్థానాల వరకు అర్హత కలిగిన నిరుద్యోగులు ఉన్నప్పటికీ, ఆ పైన ఉన్న నంబర్ వ్యక్తిని సెలెక్టు చేయడంపై బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. కొంతమంది వ్యక్తులు అడ్డదారిలో సెలక్ట్ చేస్తున్నారని, దాంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని, దీనిపై కలెక్టర్ విచారణ చేయించాలని ప్రేమ్ కుమార్ డిమాండ్ చేస్తున్నాడు. ఫోన్‌లో డబ్బుల డిమాండ్, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తనకు అనుమానం ఉందని పేర్కొంటూ ప్రేమ్‌కుమార్ కలెక్టరేట్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగ మెరిట్ జాబితాపై అభ్యంతరాలను తెలిపేందుకు ఈ నెల 1వ తేదీ(గురువారం) వరకు అవకాశం ఇచ్చామని, ప్రస్తుతం ఫిర్యాదు చేసిన వ్యక్తి అభ్యంతరం తెలుపుతూ ఎలాంటి దరఖాస్తు ఇవ్వలేదని తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు అర్హత ఉంటే ఉద్యోగం వస్తుందని, తమ కార్యాలయం నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే విచారణ జరిపిస్తామన్నారు. ఎవరి ఫోన్, ఎక్కడ నుంచి వచ్చిందనే దానిపై సైతం ఆరా తీస్తామని తెలిపారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

- పట్టించుకోని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- సీజేఎల్ఎంలకు దక్కని ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ : సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులు ఇచ్చినా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విద్యుత్ కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 7,114 ఉద్యోగాల భర్తీకి 2006, జూన్ 8న ఒకసారి.. 2006 అక్టోబర్ 20న మరోసారి నోటిఫికేషన్ విడుదలైంది. పలువురు అర్హత పరీక్షకు హాజరై ఉద్యోగానికి అర్హత సాధించారు. ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్‌తో మొదటి సారి 2007లో దాదాపు 1,564 మందిని కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్లుగా, కోర్టుకు వెళ్లిన తర్వాత 2011లో దాదాపు 875 మందిని నియమించారు. నియామక ప్రక్రియలో కేవలం వయస్సును మాత్రమే ప్రామాణికంగా తీసుకుని భర్తీ చేపట్టడంతో అప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిలో సబ్ స్టేషన్ ఆపరేటర్లుగా, ఇతర ఉద్యోగాలు చాలా రోజులుగా చేస్తున్న వారు నష్టపోయారు. దీంతో నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా మెరిట్‌ను పరిగణలోకి తీసుకోలేదని, నోటిఫికేషన్ ముందు కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఎక్కువ పనిదినాలు నిర్వహించి, ఇంటర్వ్యూలో అర్హత సాధించిన తమను ఉద్యోగానికి ఎంపిక చేయలేదని అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. ద్విసభ్య ధర్మాసనం 2009 నవంబర్ 10న అర్హత కలిగి ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు క్లాజ్–6 (4)(సీ) ప్రకారం 2007, 2011లో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాన్ని ఆదేశించింది. కోర్టు తీర్పు మేరకు 2011 ఆగస్టు 2న ఉద్యోగాలు ఇచ్చిన వీరికి సర్వీస్ బెనిఫిట్స్ మాత్రం కల్పించలేదు. దీంతో కోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా అమలు చేయలేదని ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు అభ్యర్థులకు సర్వీస్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని తీర్పు ఇచ్చారు. అప్పటి ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కార్తికేయ మిశ్రా నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు సీనియారిటీ జాబితా తయారు చేయాలని మెమో జారీ చేశారు. 2007, 2011లో నియామకమైన అభ్యర్థులందరితో సీనియారిటీ జాబితాను రూపొందించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసినప్పుడు తక్కువ పనిదినాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయగా వారు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు 2019 ఫిబ్రవరి 25న తీర్పు ఇస్తూ 2009లో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆదేశించగా, అభ్యర్థులు ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి వినతి పత్రం అందించారు. నాటి నుంచి నేటి వరకు సీఎండీలు మారుతున్న తమకు మాత్రం న్యాయం జరుగడం లేదని 2011లో ఉద్యోగాలు పొందిన సీజేఎల్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు 2011 నుంచి జీతం ఇవ్వాల్సి ఉండగా 2016 నుంచి మాత్రమే జీతం చెల్లిస్తున్నారని తెలిపారు. ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మ్యాన్ డేస్‌ను కాకుండా పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవడంతో మ్యాన్‌డేస్ (పని దినాలు) ఎక్కువగా ఉన్న వారు సీనియారిటీని కోల్పోతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

భద్రకాళి దేవాలయంలో ఎదుర్కోలు ఉత్సవం

- మకర, చంద్రప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు
- నేడు భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవం



మకరవాహనంపై అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడోరోజు భద్రకాళిభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించి.. అమ్మవారిని పూలమాలలతో అలంకరించారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని మకరవాహనంపై ఊరేగించారు. సేవాకార్యక్రమాలకు వరంగల్ ఆర్యవైశ్య సంఘం దాతలుగా వ్యవహరించారు. మహిళలు కుంకుమపూజలు, లలితాసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్‌రావు, ప్రోగ్రాం కన్వీనర్ తొనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, అయితా గోపినాథ్, అల్లాడి వీరభద్రయ్య, గుండా హైమావతి, శ్రీరాం శైలజ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 7గంటలకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. అమ్మవారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. సంస్కృత పండితులు దోర్బల ప్రభాకరశర్మ, గోరుగస్తు భాస్కర వెంకటసుబ్రహ్మణ్యశర్మ శివకల్యాణ రాయభారం ఘట్టాన్ని వివరించారు.నేడు(శుక్రవారం) సాయంత్రం నిర్వహించే భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని, పాల్గొనేవారు రూ.516 చెల్లించాలని తెలిపారు. వారికి కల్యాణోత్సవ తలంబ్రాలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేయనున్నట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

భద్రకాళి కల్యాణబ్రహోత్సవాల పూజాకార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే పాల్గొన్నారు. వారి వెంట కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు పూడికతీత, మాడవీధులు, దేవాలయం నుంచి కాపువాడ వరకు గల భద్రకాళి చెరువు కట్టను బలోపేతం చేస్తూ చుట్టూ గుట్టలను, చెరువు, పచ్చదనం సంతరించుకునేలా ఆలయప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కుడా అధికారులను కోరారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకరి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహం

నెల్లికుదురు: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని సంధ్య తండా పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సిరోలు మండలం కాంపల్లి గ్రామానికి చెందిన పులసాని విష్ణువర్ధన్‌రెడ్డి (40) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబంతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో నెల్లికుదురు మండలం కాస్యతండాకు చెందిన బానోతు లక్ష్మణ్ వరి గడ్డిని ట్రాక్టర్‌లో వెడల్పుగా లోడు చేసుకుని నెల్లికుదురు వైపునకు అజాగ్రత్తగా నడుపుతూ రాంగ్ రూట్లో వచ్చి మండలంలోని సంధ్య తండా పరిధిలోని నెల్లికుదురు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై విష్ణువర్ధన్ రెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి తల్లి పులసాని రజిత ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని మరొకరు..



పరశురాములు(ఫైల్)

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌బాబు గురువారం తెలిపిన వివరాల ప్రకారం .. మునిగలవీడు గ్రామానికి చెందిన ఉప్పరబోయిన పరశురాములు (59) ఏప్రిల్ 25న తన టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్‌పై మహబూబాబాద్ వైపునకు వెళ్లుండగా.. మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన మందుల వెంకన్న తన బైక్‌పై నెల్లికుదురు వైపు నుంచి శ్రీరామగిరి గ్రామానికి వెళ్తూ రాంగ్ రూట్లో పరశురాములు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రికి తరలించారు. పరశురాములు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో అక్కడ చికిత్స పొందుతూ పరశురాములు మృతి చెందాడని మృతుడి బాబాయి ఈర వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మామిడికాయలు కోస్తుండగా విద్యుత్ షాక్..

- కుడా జూనియర్ అసిస్టెంట్ మృతి
- దేశాయిపల్లిలో విషాదఛాయలు



అంకేశ్వరపు చంద్రమౌళి(ఫైల్)

దుగ్గొండి: పచ్చడి మామిడి కాయలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని దేశాయిపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన అంకేశ్వరపు చంద్రమౌళి(40) గతంలో వీఆర్‌ఓగా పనిచేశాడు. ప్రస్తుతం కుడా పరిధిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 29న తన బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా స్వగ్రామం దేశాయిపల్లికి వచ్చాడు. తిరిగి విధులు నిర్వర్తించే ప్రాంతానికి వెళ్లేముందు ఓ కర్రకు చివరన ఇనుప కొడవలి కట్టి తమ ఇంటి ఆవరణలోని మామిడి కాయలు కోస్తున్నాడు. ఈక్రమంలో చెట్టుపై నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు కొడవలి తగిలింది. కర్ర పచ్చిగా ఉండడంతో విద్యుత్‌షాక్ తగిలి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. చంద్రమౌళికి భార్య దేవేంద్ర, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి అంకేశ్వరపు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

బరిసె మెడపై కోసుకుపోయి వ్యక్తి మృతి

ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ..
- ఓ వాహనంపై ఉన్న బరిసె మరో వాహనంపై ఉన్న వ్యక్తి గొంతుకు కోసుకుపోవడంతో ఘటన..
- మృతదేహంతో బంధువుల ఆందోళన



రమేశ్ గొంతు కోసుకుపోయింది ఈ బరిసెతోనే..



రమేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

దంతాలపల్లి: ప్రమాదవశాత్తు పామాయిల్ చెట్టును చెక్కే బరిసె గొంతుకు కోసుకుపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. అప్పటివరకు తనతో కలిసి మాట్లాడుతూ వచ్చిన భర్త క్షణాల్లో మృతి చెందడంతో ఆ ఇల్లాలు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనకుంట తండా గ్రామానికి చెందిన బానోత్ రమేశ్ (40)తన భార్య సునీతతో కలిసి ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం వచ్చారు. ఆ గ్రామానికి చెందిన పెల్లి దామోదర్ రెడ్డి తన పామాయిల్ తోటలో పనిచేయడానికి బరిసెను పదును పెట్టించుకుని ద్విచక్రవాహనంపైన పెట్టుకుని ఇంటికి తీసుకెళ్తున్నాడు. గ్రామసమీపంలో రెండు వాహనాలు ఎదురుపడ్డాయి. ఎదురుగా వస్తున్న రమేశ్(40) గొంతుకు బరిసె కోసుకుపోవడంతో బైక్ పై నుంచి పడిపోయాడు. తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. వారు చేరుకుని రమేశ్‌ను పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు దీప్తి, దీపిక ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన

రమేశ్ మృతి విషయం తెలుసుకున్న తండావాసులు మృతదేహాన్ని దామోదర్ రెడ్డి ఇంటిఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. తొర్రూరు సీఐ గణేశ్, దంతాలపల్లి ఎస్సై రాజు, నర్సింహులపేట ఎస్సై సురేశ్ ఘటనస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.